నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, శనివారం 9 నవంబర్ 2024 | KHAMMAM



జిన్నింగ్ మిల్లులోనే ప్రైవేట్‌గా కొనుగోలు చేసిన పంట

# సీసీఐలో చిక్కులు.. ప్రైవేట్‌లో పేచీలు



సీసీఐ కేంద్రానికి పంటను తీసుకొచ్చిన వాహనాలు

**రెంటికి చెడిన రేవడిలా పత్తి రైతులు**

**తేమశాతం పేరుతో దగా చేస్తున్న వ్యాపారులు**

**సీసీఐ కేంద్రాల్లో కొరవడిన అధికారుల నిఘా**

**పంటను 'ప్రైవేట్'కు తెగనమ్ముకుంటున్న వైనం**

**ఈ ఏడాది అరిగోస పడుతున్న కర్షకులు**

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 8 : ఈ సంవత్సరం పత్తి సాగు చేసిన రైతుల కష్టాలు రాస్తే రామాయణం.. చెబితే భాగవతం అన్నట్లు ఉంది. వానకాలం సీజన్ ఆరంభమైంది మొదలు పంట చేతికొచ్చే వరకూ జిల్లా రైతులు అడుగడుగునా అరిగోస పడుతున్నారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వాల్సిందిపోయి మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నది. పంటల పెట్టుబడి(రైతుబంధు) రాక, రుణమాఫీ పూర్తిగా జరగకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి మరీ పంటను కంటికిరెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. వీటన్నింటినీ తట్టుకొని నిలబడిన రైతులకు తీరా మార్కెట్లో మద్దతు ధర లేకపోవడంతో వారి పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లు ఉంది. ప్రధాన పంట అయిన పత్తి తీరా చేతికొచ్చేసరికి ఆశించిన ధర రాకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలకు రైతులు పోయే పరిస్థితి లేదు. సీసీఐ అధికారులు పెడుతున్న అనేక కొర్రీల కారణంగా ప్రైవేట్ వ్యాపారులకే పంటను తెగనమ్ముకుంటున్నారు. ప్రైవేట్‌తో పోల్చుకుంటే కనీసం పావుశాతం సైతం సీసీఐ అధికారులు పంట కొనలేదు. తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతున్న తరుణంలో సదరు రైతులు అదే సీసీఐ కేంద్రంలో అదే జిన్నింగ్ మిల్లు యజమానికి అడ్డికి పావుశేరు చొప్పున పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సర్కార్ స్పందించి పత్తి రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని క్వింటా ఒక్కంటికి రూ.1000 బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### సీసీఐ కొర్రీలతో పంట ప్రైవేట్‌పరం..

ప్రైవేట్ వ్యాపారులు పంటలను ఇష్టారీతిన కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రతియేటా ఏర్పాటు చేస్తున్నది. కానీ.. ప్రభుత్వ ఉద్దేశం నెరవేరకపోగా పరిస్థితి భిన్నంగా ఉంటోంది. మద్దతు ధర కోసం పంటను సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్తున్న రైతులు అక్కడే అదే జిన్నింగ్ మిల్లు యజమానికి అడ్డికి పావుశేరుకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సంవత్సరం అధికారులు ఖమ్మం జిల్లావ్యాప్తంగా 9 జిన్నింగ్ మిల్లులను సీసీఐ కొనుగోళ్లకు నోటిఫై చేశారు. అయితే వాటిలో ఆరు కేంద్రాల్లో క్రయవిక్రయాలు జరుగుతున్నప్పటికీ మూడు కేంద్రాల్లో మాత్రమే మూడంకెల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు జరిగింది. ఎన్నో ఆశలతో పంటను సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులకు అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. రైతులు తీసుకొచ్చిన పంటకు సంబంధించిన వాహనంలో అడుగడుగునా తేమశాతం నిర్ధారణ యంత్రాలను ఉపయోగించి రిజక్టు చేస్తున్నారు. దీంతో పంటను తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక సూపర్ క్వాలిటీ ఉన్న పంటను సైతం అదే కేంద్రంలో అదే జిన్నింగ్ మిల్లు యజమానికి క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.6,300 వరకు అమ్ముకుంటున్నారు. కావాలని రైతులను ఇబ్బంది పెట్టి మరీ ఎట్టకేలకు మిల్లు ఓనర్లకు పంటను అమ్ముకునే విధంగా సీసీఐ అధికారులు ప్రవర్తిస్తున్నారు.

### పేచీల పేరుతో ప్రైవేట్‌లో కొత్త చిక్కులు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లోని పత్తి యార్డులో ఖరీదుదారులు గత రెండు మూడ్రోజుల నుంచి పేచీల పేరుతో పత్తి రైతులను చిత్తు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల తంతును పసిగట్టిన మార్కెట్ ప్రైవేట్ వ్యాపారులు పాత పద్ధతికి పదును పెట్టారు. పత్తి యార్డులో జాతీయ అగ్రీ మార్కెట్ విధానం(ఈ నామ్) అమలులో ఉన్నప్పటికీ ఉదయం 8 నుంచి 9 గంటల లోపే పత్తి ఖరీదుల ప్రక్రియ పూర్తి అవుతున్నది. పంటకు ఎంత ధర సీక్రెట్ బిడ్డింగ్‌లో రాబోతుందో కేవలం రెండు గంటల ముందే ప్రతి రైతుకు తెలుస్తుంది. అయితే పంటను పూర్తిగా పరిశీలన చేసి బిడ్ చేస్తున్న ఖరీదుదారులు తీరా కాంటాల సమయంలో పంట నాణ్యత లేదని కొర్రీలు పెడుతూ ధరలో కోత పెడుతున్నారు. ఈ నామ్ విధానంలో పేచీలకు ఎట్టి పరిస్థితిలో స్థానం లేకపోయినప్పటికీ ఖరీదుదారులు మాత్రం తమ పాత విధానాన్ని మరోమారు తెరపైకి తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. పత్తి యార్డులో ఉన్న మొత్తానికి మొత్తం ఖరీదుదారులు కమీషన్ పద్ధతిలో రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు రాష్ర్టాలకు పంటను ఎగుమతి చేస్తున్నారు. అయితే బిల్ టూ బిల్ అని ఒప్పందంతో పంటను ఎగుమతి చేస్తున్న వ్యాపారులు పేచీలు పెట్టి సొమ్ము చేసుకుంటున్న తీరు రైతులు, కమీషన్ వ్యాపారులను సైతం నివ్వెరపెడుతున్నది.



తేమ శాతం నిర్ధారణ చేస్తున్న సీసీఐ సిబ్బంది

### సీసీఐ కేంద్రాల వద్ద కొరవడిన నిఘా..

సీసీఐ కేంద్రాల్లో ప్రైవేట్ దందా, తేమ శాతం కొర్రీలను క్షేత్రస్థాయిలో చూసే ప్రభుత్వ అధికారులు కరువయ్యారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు ఆయా జిన్నింగ్ మిల్లుల వద్ద ఉండి రైతుల సందేహాలను నివృత్తి చేయాలి. ఈ ప్రక్రియను పర్యవేక్షణ చేసేందుకు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సైతం నిరంతరం పర్యవేక్షణ చేయాలి. వీరితోపాటు జిన్నింగ్ మిల్లుల సమీపంలోని మార్కెట్ కమిటీ సెక్రటరీలు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నిరంతరం పర్యవేక్షణ చేయాలి. కానీ.. కేవలం మార్కెట్ కమిటీకు చెందిన డేటా ఎంట్రీ ఆఫీసర్ మినహాయించి సీసీఐ కేంద్రాల్లో ఇతర అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. అలా వచ్చామా, ఇలా వెళ్లామా సోషల్ మీడియాలో ఫొటో అప్‌లోడ్ చేశామా అన్నట్లు అధికారులు వచ్చిపోతున్నారని, తమ సమస్యలు వినే నాధుడు లేడని రైతులు వాపోతున్నారు.

### సీసీఐ కేంద్రంలోనే ప్రైవేట్‌గా అమ్ముకున్నా..



సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకొచ్చే దానికంటే ఎంతకో అంతకు మార్కెట్లో అమ్ముకోవడం నయం అనిపించింది. పంటను ఆరబెట్టి లూజుగానే అందరూ చెప్పినట్లు గుర్రాలపాడు సీసీఐ కేంద్రానికి పత్తి తీసుకొచ్చాను. ఒకేసారి పంట మొత్తం దాదాపు 25 క్వింటాళ్లు తీసుకొచ్చా. సీసీఐ సిబ్బంది వచ్చి తేమ శాతం చూశారు. బండిలో ఎక్కడో ఒక దగ్గర మీటర్ పెట్టి చూడాలి.. కానీ.. మొదట 11 శాతం తేమ ఉందని రావడంతో బండి మొత్తం పొక్కలు పెట్టి చూశారు. ఒక్కో పోటు వద్ద ఒక్కో రకంగా 11 నుంచి 18 శాతం వచ్చే వరకు చూశారు. తర్వాత ఈ పంట మాకొద్దు అని చెప్పారు. తిరిగి ఇంటికి తీసుకెళ్తే మళ్లీ ట్రాలీ కిరాయి, ప్రైవేట్‌కు తీసుకుపోవాలంటే బస్తాల్లో తొక్కాలి. ఇక నా వళ్ల కాదని ఇదే సీసీఐ కేంద్రంలోనే ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాకు రూ.6,300 చొప్పున అమ్ముకున్నా.

**– ధరావత్ లక్ష్మణ్, రైతు, రాంక్యాతండా, రఘునాథపాలెం మండలం**

### పదకొండు శాతం వస్తే పక్కకు పెట్టారు..



సీసీఐ అధికారులు మమ్మల్ని ఇంత గోస పెడుతున్నారు. నేను తీసుకొచ్చిన పంటలో 11.4 శాతం తేమ శాతం ఉందని వాళ్లే చెప్పారు. సరే తీసుకోండి అని చెప్పాను. వెంటనే మరో మూలకు తేమ శాతం చూశారు. 12 శాతం వచ్చింది. అలా మూడు సార్లు చూసిచూసీ 16 శాతం ఉంది.. ఇప్పుడు కొనలేం అన్నారు. పంట పూర్తిగా ఆరబెట్టు తర్వాత కొంటాం అంటున్నారు. మిల్లు వద్ద పంటను ఎలా ఆరబెట్టాలి. తీరా ఆరబెట్టిన తర్వాత సైతం కొంటారనే నమ్మకం లేదు. సీసీఐకి పంటను తీసుకొచ్చుడు పెద్ద పొరపాటు అయ్యింది.

**– ఏనుగంటి ప్రవీణ్, రైతు, పెద్దమండవ, ముదిగొండ మండలం**

### తీరా ఇంటికి పోయే ముందు పేచీపెట్టారు..



తెల్లవారుజామున 4 గంటలకు ఖమ్మం పత్తి మార్కెట్‌కు మా నాన్న 40 బస్తాల పంటను తీసుకొచ్చాడు. 8 గంటల సమయంలో కొందరు వ్యాపారులు వచ్చి పంటను చూశారు. క్వింటాకు రూ.6,500 వరకు మాత్రమే ధర పెడతాం అని చెప్పడంతో ఇష్టం ఉన్నా లేకపోయినా సరే అన్నాం. పదిన్నర తర్వాత మా పంట అమ్ముడుపోయింది. శ్రీనివాస్ అనే ఖరీదుదారుడు కొన్నాడని కమీషన్ వ్యాపారి చెప్పాడు. నాన్న ఇంటికిపోయాడు. మధ్యాహ్నం ఒంటిగంటకు కాంటా సమయంలో వచ్చి పది బస్తాలు మళ్లీ కోశాడు. పంట బాగాలేదు. అంత పెట్టలేను.. క్వింటాకు రూ.6,100 మాత్రమే పెడుతా అన్నాడు. ఇంత నిలువుదోపిడీ ఇంకా ఏమైనా ఉందా. పంట కొనేవారు మరీ బరితెగించి మాట్లాడుతున్నారు.

**– వీరగణేశ్, రైతు, బాలపేటతండా, రఘునాథపాలెం, మండలం**



ఖమ్మం పత్తియార్డుకు రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

---

## న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి**

కొత్తగూడెం టౌన్, నవంబర్ 8 : ఉచిత న్యాయ సేవలను పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా జూలూరుపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్థికంగా లేని వారు న్యాయ సేవలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారు ఉచిత న్యాయ సేవల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను వినియోగించుకోవాలని సూచించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు 1987 ప్రకారం ప్రతి సంవత్సరం నవంబర్ 9న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిరంజన్‌రావు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, న్యాయవాది తెల్లబోయిన రమేశ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల ధర్నా



భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 8 : అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమకు తక్కువ వేతనాలు అందిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేల్పుల మల్లికార్జున్, ఎండీ.యూసుఫ్, బానోతు ప్రియాంక, పార్వతి, బాలనాగమ్మ, పద్మజ, ఇందిర, అరుణ, సుమలత, రాములమ్మ, జ్యోతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-3 పరీక్షలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 39 కేంద్రాల్లో 13,848 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 17న పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, 18న పేపర్-3 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

## భద్రాద్రిలో ఏకాదశి అధ్యయనోత్సవాలు

**జనవరి 9న తెప్పోత్సవం, 10న ఉత్తరద్వార దర్శనం**

భద్రాచలం, నవంబర్ 8 : చాంద్రమాన క్రోధినామ సంవత్సర పుష్యశుద్ధ పాడ్యమి మంగళవారం నుంచి పుష్యబహుళ షష్ఠి సోమవారం (31.12.2024 నుంచి 20.1.2025) వరకు భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలోవైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. స్వామివారు డిసెంబర్ 31 నుంచి జనవరి 8వ తేదీ వరకు 9 రోజులపాటు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. జనవరి 9న తెప్పోత్సవం, 10న వైకుంఠ ఏకాదశి(ఉత్తరద్వార దర్శనం), అదేరోజు సాయంత్రం రాపత్తు సేవ ఉంటుందని, ఈ ఉత్సవాలు జనవరి 26తో ముగుస్తాయని ఆలయ అధికారులు వెల్లడించారు. అధ్యయనోత్సవాలు నిర్వహించే 27 రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు.

## హామీల అమలులో సర్కారు విఫలం

- తులం బంగారం, పింఛన్ల పెంపు ఊసే లేదు
- పత్తి, ధాన్యం రైతులకు మద్దతు ధర దక్కని పరిస్థితి
- భద్రాద్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

జూలూరుపాడు, నవంబర్ 8 : అలవిగాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని, పథకాల విషయంలో రైతులకు ఇచ్చిన మాట కూడా తప్పిందని భద్రాద్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కల్యాణలక్ష్మితో పాటు పెళ్లి కానుకగా తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రతి మహిళకు రూ.2,500 చొప్పున పింఛన్, వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికుల పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేసిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పేరిట రూ.10 వేలు ఇస్తే.. దాని పేరు రైతు భరోసాగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పి 11 నెలలు గడిచినా అతీగతీ లేదన్నారు. ఆరుగాలం శ్రమించి పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ధాన్యం చేతికొస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం బీఆర్‌ఎస్‌దేనని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, చావా వెంకట రామారావు, చాపలమడుగు రామ్మూర్తి, సాయిల నాగేశ్వరరావు, తాళ్లూరి రామారావు, సాయిన్ని హరీశ్, నవీన్, బాదావత్ కిషన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలి

**భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు**



కరకగూడెంలో సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న ఎస్పీ

పినపాక(కరకగూడెం), నవంబర్ 8 : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లలో పనిచేసే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. వారి కదలికలపై మరింత నిఘా పెట్టాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ఏడూళ్లబయ్యారం, కరకగూడెం పోలీస్‌స్టేషన్లను శుక్రవారం సందర్శించిన ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, అప్పుడే పోలీసులంటే ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం స్టేషన్ల పరిధిలోని పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రాజ్‌కుమార్, రాజేందర్, టీఎస్‌పీఎస్సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు ముఖ్యం

**జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య**




రైతులతో మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 8 : విత్తనోత్పత్తి చేసే సాగు రైతులు అపరిచితుల మాటలు నమ్మొద్దని, సరైన ఆధారాలతో ఏజెంట్ ద్వారా ఒప్పందం జరిగితేనే సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) దనసరి పుల్లయ్య సూచించారు. అర్బన్ మండలం బాలపేట గ్రామంలో రెండో పంట సాగులో భాగంగా మక్క, పత్తి పంటల విత్తనోత్పత్తి చేలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం 20 ఏళ్లుగా విత్తనోత్పత్తి చేస్తున్న సాగు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ విత్తనోత్పత్తి చేపట్టిన రైతులు సాగు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఆధారం లేని కంపెనీలను నమ్మి విత్తనోత్పత్తి చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కొంగర వెంకటేశ్వర్లు, టి.కరుణశ్రీ, వి.శ్రీనివాసరెడ్డి, ఏవోలు పవన్, కిశోర్‌బాబు, వై.శ్రీనివాస్, ఏఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కొర్రీలతో కేజీ పత్తి కొనలే..

**దెందుకూరు సీసీఐ కేంద్రం సందర్శనలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు**



సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న కమల్‌రాజు

మధిర రూరల్, నవంబర్ 8 : కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన పత్తికి కొర్రీలు పెడుతూ.. నిబంధనలు, షరతులు విధిస్తూ ఇప్పటివరకు కేజీ కూడా కొనలేదని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను తుంగలో తొక్కి నట్టేట ముంచుతున్నదని మండిపడ్డారు. దెందుకూరు గ్రామంలోని కనకదుర్గ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పత్తి విక్రయానికి తీసుకొచ్చిన రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తేమ శాతం పేరుతో రైతులు తీసుకొచ్చిన పత్తిని వెనుకకు పంపిస్తున్నారని, దీంతో కొందరు రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఎలాంటి షరతులు లేకుండా రైతుల పత్తిని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## లాభాల పంట మునగ

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : రైతులు మునగ సాగు ద్వారా దిగుబడులతోపాటు అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోలు, ఏపీవోలు, ఎంపీవోలు, ఏఈవోలు, టీఏలు, ఈసీలు, ఎఫ్‌ఏలు, రైతులకు మునగ సాగుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలంలో పని చేసుకుంటూ ఉపాధిహామీ పథకం ద్వారా కూలి, మెటీరియల్ రూపంలో మనకే డబ్బులు వచ్చే అద్భుతమైన అవకాశం మునగ సాగు ద్వారా ఉందన్నారు. ఎకరానికి వెయ్యి మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయలు కాస్తే.. వెయ్యి మొక్కలకు 1.50 లక్షల కాయలు వస్తాయని, వీటిని రూపాయికి రెండు చొప్పున అమ్మినా రూ.75 వేల ఆదాయం వస్తుందన్నారు. అనంతరం అధికారులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు